సాక్షి
రంగారెడ్డి
శుక్రవారం ᛫ 12 ᛫ జనవరి ᛫ 2024



గంజాయి ముఠా గుట్టురట్టు

ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా గంజాయి తరలిస్తున్న ముఠా సభ్యులను ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 8లో▸



'లెవీ' పూర్తిచేయాలి

లెవీ బియ్యాన్ని పూర్తి చేయాలని పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ రఘునందన్ హెచ్చరించారు. 8లో▸



ఉపాధ్యాయుడికి సన్మానం

అమ్డాపూర్ జెడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయుడు నగేశ్‌బాబును విద్యార్థులు ఘనంగా సన్మానించారు. 8లో▸

న్యూస్‌రీల్


వడ్డె ఓబన్నకు ఘన నివాళి



ఓబన్న చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న జిల్లా రెవెన్యూ అధికారి సంగీత

ఇబ్రహీంపట్నం రూరల్: వడ్డె ఓబన్న 208వ జయంతి ఉత్సవాలను కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం అధికారికంగా నిర్వహించారు. ఓబన్న చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వడ్డెర సంఘం అధ్యక్షుడు వెంకటరమణ, కుల సంఘం నాయకులు ఎల్లయ్య, దేరంగుల కృష్ణ, వరికుప్పల సుధాకర్, వరికుప్పల వెంకటేశ్, శ్రీశైలం, పల్లపు విఘ్నేష్, బీసీ సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఓపెన్ వర్సిటీలో ప్రవేశాలకు గడువు పొడిగింపు



చేవెళ్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీలో ప్రవేశాలకు ఈనెలాఖరు వరకు దరఖాస్తు గడువు పొడిగించినట్లు చేవెళ్లలోని అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ కేంద్రం కో ఆర్డినేటర్ షేక్ మహబూబ్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. డాక్టర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీలో ప్రవేశాలకు సంబంధించిన గడవును ఈనెల 31వ తేదీ వరకు పొడిగించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డిగ్రీలో బీఏ, బీకాం, బీఎస్సీ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దీనికి ఇంటర్ పాసైన, లేదా సమాన అర్హత కలిగిన అభ్య ర్థులు అర్హులని చెప్పారు. చేవెళ్లలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ స్టడీ కేంద్రం ఉందని, దీనిని ఈ ప్రాంతంలోని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. పూర్తి వివరాలకు 99086 40914 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ధ్యానంతోనే శాంతి



మాట్లాడుతున్న డాక్టర్ టోనీ నాదర్

నందిగామ: ప్రతి ఒక్కరూ ధ్యానం చేస్తే శాంతి పొందుతారని హార్వర్డ్ స్పీకర్, జీయూఎస్పీ చైర్మన్ డాక్టర్ టోనీ నాదర్ అన్నారు. కాన్హా శాంతి వనంలోని ప్రపంచంలోనే అతిపెద్ద ధ్యాన మందిరంలో 'గ్లోబల్ యూనియన్ ఆఫ్ సైంటిస్ట్స్ ఫర్ పీస్ (జీయూఎస్పీ) ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యక్తి మెదడు ఏ విధంగా పనిచేస్తుందో శాస్త్రవేత్తలు ప్రదర్శన రూపకంగా చూపించారు. అనంతరం డాక్టర్ టోనీ నాదర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ వీలైన సమయంలో ధ్యానం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి మాట్లాడుతూ.. యోగ, ధ్యానం ప్రాముఖ్యతలను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ ఫ్రిడ్ ట్రావీస్, డాక్టర్ జాన్ హగ్లీన్, పలు దేశాలకు చెందిన సుమారు 10 వేల మంది ప్రముఖులు పాల్గొన్నారు.

నిధులకు కోత..!

- రూ.150 కోట్ల ఎస్‌డీఎఫ్ ఫండ్స్ నిలిపివేత
- గత ప్రభుత్వ హయాంలో మంజూరు
- రద్దు చేసిన ప్రస్తుత ప్రభుత్వం
- మీర్‌పేట్, బడంగ్‌పేట్, జల్‌పల్లి, తుక్కుగూడ మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులకు బ్రేక్



సాక్షి, రంగారెడ్డిజిల్లా: కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం జిల్లాలోని ఆ నాలుగు మున్సిపాలిటీల భవితవ్యాన్ని ప్రశ్నార్థకంగా మార్చేసింది. కార్పొరేషన్లు, మున్సిపాలిటీల అభివృద్ధి కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ (ఎస్‌డీఎఫ్) కింద జిల్లాలోని రెండు కార్పొరేషన్లు, రెండు మున్సిపాలిటీలకు రూ.150 కోట్లు మంజూరు చేసింది. అధికారులు ఆయా అభివృద్ధి పనులకు అంచనాలు సిద్ధం చేసి, శంకుస్థాపనలు కూడా చేశారు. తీరా పనులు ప్రారంభించాల్సిన సమయంలో గతంలో కేటాయించిన నిధులను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. అరకొర నిధులతో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న ఆయా మున్సిపాలిటీలు.. ప్రస్తుత ప్రభుత్వ ప్రకటనతో మరింత వెనుకబడిపోనున్నాయి.

కేసీఆర్ ఇచ్చారు..రేవంత్ రద్దు చేశారు

గత బీఆర్ఎస్ ప్రభుత్వం జూన్ 19న మహేశ్వరం నియోజకవర్గం తుమ్మలూరులో హరితహారం కార్యక్రమాన్ని ప్రారంభించింది. అప్పటి సీఎం కేసీఆర్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అప్పటి విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి కోరిక మేరకు జిల్లాలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న బడంగ్‌పేట్, మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్లకు చెరో రూ.50 కోట్ల చొప్పున, తుక్కుగూడ, జల్‌పల్లి మున్సిపాలిటీల అభివృద్ధికి రూ.25 కోట్ల చొప్పున మొత్తం రూ.150 కోట్లు మంజూరు చేశారు. ఈ మేరకు పాలనాపరమైన అనుమతి కూడా ఇచ్చారు. సీఎం హామీ మేరకు సంబంధిత అధికారులు మున్సిపాలిటీల్లోని వార్డులు, కాలనీల వారీగా డ్రైనేజీ, రోడ్ల నిర్మాణాలకు అంచనాలు రూపొందించారు. అప్పటి మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ఆయా పనులకు శంకుస్థాపనలు కూడా చేయించారు.

ప్రశ్నార్థకంగా మున్సిపాలిటీల అభివృద్ధి

తీరా పనులు ప్రారంభించే సమయానికి ఎన్నికల కోడ్ రావడంతో ఆయా పనులను తాత్కాలికంగా వాయిదా వేయాల్సి వచ్చింది. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఓటమి పాలై, కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. గత సీఎం కేసీఆర్ మంజూరు చేసిన నిధులను రద్దు చేస్తున్నట్లు ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రకటించింది. ఈ మేరకు గ్రౌండింగ్ దశలో ఉన్న పనులన్నీ నిలిపివేయాల్సిందిగా ఇటీవల కలెక్టర్ ఆయా మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఆయా మున్సిపాలిటీల్లో ప్రతిపాదించిన అభివృద్ధి పనుల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది.

కుల సంఘాల్లో ఆందోళన

నియోజకవర్గం పరిధిలోని 66 గ్రామ పంచాయతీలకు (మహేశ్వరంలో 31, కందుకూరులో 35) రూ.9.90 కోట్లు, తుమ్మలూరుకు దశాబ్ది కమ్యూనిటీ హాల్, రూ.7కోట్లతో 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. సీఎం ప్రకటించిన రెండు రోజులకే మంత్రి ఆ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన కూడా చేశారు. అయితే వీటికి మంజూరు చేసిన నిధులను కూడా నిలుపుదల చేసినట్లు తెలిసింది. కుల సంఘాల భవనాలకు స్థలాలు కేటాయించింది. నిర్మాణాల కోసం రూ.10 కూడా మంజూరు చేసింది. అయితే ఆ నిధులను కూడా నిలిపివేసినట్లు ప్రకటించడంతో ఆయా కుల సంఘాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

రద్దు చేయడం అన్యాయం

అప్పటి సీఎం కేసీఆర్‌ను ఒప్పించి, మెప్పించి నియోజకవర్గం అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయించాం. ప్రొసీడింగ్స్ కూడా ఇచ్చారు. మున్సిపాలిటీలు, వార్డుల వారీగా చేపట్టాల్సిన పనులను గుర్తించి ఆ మేరకు అంచనాలు కూడా రూపొందించాం. పనులు ప్రారంభించే సమయంలో స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద మంజూరు చేసిన నిధులను నిలిపివేయడం అన్యాయం. ప్రభుత్వ నిర్ణయం మీర్‌పేట్, బడంగ్‌పేట్, జల్‌పల్లి, తుక్కుగూడ అభివృద్ధికి ఆటంకగా మారుతోంది. గత ప్రభుత్వం కేటాయించిన నిధులు కేటాయించక పోగా, కొత్తగా ఎమ్మెల్యేకు రూ.10 కోట్ల చొప్పున ఫండ్స్ మంజూరు చేస్తామని చెప్పడం విడ్డూరంగా ఉంది. నిలిపేసిన నిధులను తక్షణమే మంజూరు చేయించాలి. కక్ష పూరిత ధోరణికి పోకుండా నియోజకవర్గం అభివృద్ధికి సహకరించాలి. లేదంటే ప్రజల నుంచి వచ్చే వ్యతిరేకత మూటగట్టుకోవాల్సి వస్తుంది.

– సబితారెడ్డి, ఎమ్మెల్యే, మహేశ్వరం

చెంచులతో ప్రధాని భేటీ!

- ఈ నెల 15న ఢిల్లీ నుంచి వర్చువల్‌గా సమావేశం
- కడ్తాల్ గిరిజన బాలుర హాస్టల్ ప్రాంగణంలో ఏర్పాట్లు
- సంబంధిత అధికారులతో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ సమీక్ష

సాక్షి, రంగారెడ్డిజిల్లా: జిల్లాలోని చెంచులతో ప్రధాని నరేంద్రమోదీ సమావేశం కానున్నారు. ఈ నెల 15న ఢిల్లీ నుంచి వర్చువల్‌గా నిర్వహించే ఈ సమావేశానికి జిల్లాలోని కడ్తాల్, ఆమనగల్లు మండలాల పరిధిలోని చెంచుపెంటలకు చెందిన సుమారు వెయ్యి మంది చెంచులు ఈ సమావేశంలో పాల్గొననున్నారు. ఇందుకోసం కడ్తాల్‌లోని గిరిజన బాలుర హాస్టల్ ప్రాంగణంలో ఏర్పాట్లు చేయనున్నారు. ఈ మేరకు గురువారం అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ కలెక్టరేట్‌లో సంబంధిత జిల్లా అధికారులతో పీఎం జన్‌మన్ పథకంపై సమీక్షా సమావేశం నిర్వహించారు.

610 మంది చెంచులకు ఆధార్ కార్డులు జారీ

ఈనెల 15న 1000 మంది చెంచులతో ప్రధాని వర్చువల్ సమావేశానికి కావాల్సిన అన్ని ఏర్పాట్లను కడ్తాల్ గిరిజన బాలుర హాస్టల్ ప్రాంగణంలో పూర్తి చేయాలని సూచించారు. సమావేశానికి జిల్లాలోని ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ ఈ సందర్భంగా సూచించారు. జిల్లాలోని ఆమనగల్లు, కడ్తాల్ మండలాల్లో చెంచు పెంటల్లో నివసించే 610 మంది చెంచులకు నేటి వరకు 24 మందికి ఆధార్ కార్డుల నమోదు ప్రక్రియ పూర్తయిందని, 138 ఆధార్ కార్డుల అప్‌డేట్ ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని, 138 కుల ధ్రువీకరణ పత్రాలు, 51 రెసిడెన్షియల్ సర్టిఫికెట్లు జారీ చేయడం జరిగిందని అన్నారు. ప్రతి చెంచుకి ఆధార్ అందేలా చూడాలని ఆదేశించారు.

అదేరోజు క్రిసాన్ క్రెడిట్ కార్డుల అందజేత

అదేరోజు లబ్ధిదారులకు కిసాన్ క్రెడిట్ కార్డులు, జన్ మన్ బ్యాంక్ అకౌంట్, ఆయుష్మాన్ భారత్ కార్డుల అందజేయడంతోపాటు ప్రత్యేక మెడికల్ ఎంఎంయూ వాహనాన్ని ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర పథకాల ద్వారా పక్కా ఇళ్ల నిర్మాణం, రహదారుల అభివృద్ధి, మొబైల్ మెడికల్ యూనిట్ల ద్వారా ఆరోగ్య పరిరక్షణ, నిరంతర నీటి సౌకర్యం, ప్రతి ఇంటికీ విద్యుత్, అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటు, మల్టీపర్పస్ కేంద్రాలు, సోలార్ వీధి దీపాలు, మొబైల్ టవర్లు, ఒకేషనల్ విద్యా కేంద్రాలు జిల్లాలోని చెంచుగుడాల్లో ఈ పథకం ద్వారా ఏర్పాటు జరగనున్నాయని తెలిపారు. ఆమనగల్లు, కడ్తాల్ పీవీటీజీ ఆవాసాల్లోని వారందరికీ వివిధ పథకాలను మిషన్ మోడ్‌లో పూర్తి స్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి రామేశ్వరి దేవి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గీత రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ ప్రతిమా సింగ్

బీజేపీ విధానాలతో ప్రమాదం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వెస్లీ

తుర్కయంజాల్: అయోధ్య రామమందిరం పేరుతో బీజేపీ కేంద్రంలో మరోసారి అధికారంలోకి రావాలని చూస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వెస్లీ విమర్శించారు. తుర్కయంజాల్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో గురువారం ఏర్పాటు చేసిన జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దేశంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో భారత రాజ్యాంగానికి, లౌకిక ప్రజాస్వామ్య విధానానికి ప్రమాదం వాటిల్లుతోందన్నారు. ఇటీవల పార్లమెంట్‌పై జరిగిన పొగబాంబు దాడికి సంబంధించి సమాధానం చెప్పాలని ప్రశ్నించిన 146 మంది ఎంపీలను సస్పెండ్ చేయడం నియంత పాలనకు నిదర్శనం అని పేర్కొన్నారు. తెలంగాణలో నూతనంగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని లేని పక్షంలో ప్రజా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్, కార్యదర్శి వర్గ సభ్యులు బోడ సామేల్, యం.చంద్రమోహన్, డి.జగదీష్, జిల్లా కమిటీ సభ్యులు డి.కిషన్, ఇ. నర్సింహ పాల్గొన్నారు.

ఆ దరఖాస్తులను పరిశీలించాలి

అధికారులకు కలెక్టర్ శశాంక ఆదేశం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్నందున జిల్లాలోని ఆర్డీఓలు ఫామ్–7, ఫామ్–8 దరఖాస్తులను పరిశీలించాలని కలెక్టర్ శశాంక సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో ఆర్డీఓలతో లోక్‌సభ ఎన్నికలు, ధరణి తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఏవైనా లోటుపాట్లు ఉంటే సవరించుకోవాలని సూచించారు.

పేర్లను సరి చూసుకుని..

ఓటరు జాబితాలో పేర్లు తొలగించిన వాటి విషయంలో సమగ్రంగా ఇంటింటి సర్వే చేపట్టి పరిశీలన జరిపించాలని, డూప్లికేషన్లు లేకుండా చూడాలని అన్నారు. ఫామ్–8 ద్వారా మార్పులు చేయాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ, ఇంకా ఎక్కడైనా కొత్త పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉంటే ప్రతిపాదనలు పంపాలని సూచించారు. ముఖ్యంగా 1,450 పైచిలుకు ఓటర్లు కలిగిన చోట కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు కోసం ప్రతిపాదించాలని తెలిపారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తక్కువ ఓటింగ్ జరిగిన పోలింగ్ స్టేషన్లను గుర్తిస్తూ, అందుకు గల కారణాలను అన్వేషించాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

ఆ దరఖాస్తులను పరిష్కరించాలి

ప్రజావాణిలో ధరణికి సంబంధించిన దరఖాస్తులు అధిక మొత్తంలో పెండింగ్ ఉన్నాయని, వాటిని వెంటనే పరిష్కరించాలని, తప్పులు జరగకుండా చూసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీలో అలసత్వం తగదన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, ఆర్డీఓలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఈజీఎస్ పనుల్లో అక్రమాలు సహించం

డీఆర్‌డీఏ పీడీ ప్రభాకర్



ప్రజావేదిక సభలో మాట్లాడుతున్న పీడీ ప్రభాకర్

ఆమనగల్లు: ఈజీఎస్ పనుల నిర్వహణలో అక్రమాలు జరిగితే చర్యలు తప్పవని డీఆర్‌డీఏ పీడీ ప్రభాకర్ హెచ్చరించారు. ఈజీఎస్ పనులను నాణ్యతగా చేపట్టి సకాలంలో కూలీలకు బిల్లులు అందించాలని ఆయన సూచించారు. మండలంలో 2002 ఏప్రిల్ నుంచి 2023 మార్చి వరకు జరిగిన ఈజీఎస్ పనులకు సంబంధించి అన్ని గ్రామాల్లో సామాజిక తనిఖీ నిర్వహించారు. ఆమనగల్లు పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో గురువారం 13వ విడత ఈజీఎస్ సామాజిక తనిఖీ ప్రజావేదిక సభను నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లో జరిగిన ఈజీఎస్ పనులు, జరిగిన పొరపాట్లు, అక్రమాల గురించి వెల్లడించారు. మండలంలో ఏడాదికాలంలో రూ.1.75 కోట్ల పనులు జరిగినట్లు అధికారులు వివరించారు. ప్రజావేదిక సభలో పీడీ ప్రభాకర్ మాట్లాడుతూ.. అన్ని గ్రామాల్లో ఈజీఎస్ పనులను చేపట్టాలని సూచించారు. ఆయా గ్రామాల్లో జరిగే గ్రామ సభల్లో ఈజీఎస్ పనులను గుర్తించాలని, వాటినే చేపట్టాలన్నారు. జాబ్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునే కూలీలకు వెంటనే అందించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ఏపీడీ సక్రియా నాయక్, అంబుడ్స్‌మెన్ అధికారి సునీత, ఎంపీడీఓ ఫారూక్‌హుస్సేన్, ఎస్ఆర్‌పీ వెంకన్న, ఏపీఓ మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి ఘాటు



షాద్‌నగర్‌లో పట్టుకున్న గంజాయి చాక్లెట్లు

అడ్డాగా షాద్‌నగర్ ప్రాంతం

- టీ స్టాళ్లు, హోటళ్లు, కిరాణా దుకాణాల్లో విక్రయాలు
- తరచూ వెలుగు చూస్తున్న ఘటనలు
- చిన్న పిల్లలనూ వదలని అక్రమార్కులు
- చాక్లెట్ల రూపంలో గుట్టుగా దందా

షాద్‌నగర్: పారిశ్రామిక ప్రాంతాన్ని అడ్డాగా మార్చుకున్నారు.. కార్మికులను ఏమార్చడమే పనిగా పెట్టుకున్నారు.. చివరికి తమ సంపాదన కోసం చిన్నపిల్లలను కూడా వదలడం లేదు. షాద్‌నగర్ ప్రాంతంలో గంజాయి ఘాటు మత్తెక్కిస్తోంది. తరచూ వెలుగు చూస్తున్న గంజాయి స్మగ్లింగ్ దందా ఇక్కడి పోలీసులకు సవాల్‌గా మారుతోంది.

గుట్టు చప్పుడు కాకుండా..

షాద్‌నగర్ నియోజకవర్గంలో సుమారు వందకు పైగా చిన్న, మధ్యతరహా, భారీ పరిశ్రమలు ఉన్నాయి. ఈ పరిశ్రమల్లో పని చేసేందుకు దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన కార్మికులు వలస వస్తున్నారు. రాష్ట్ర రాజధానికి సమీపంలో ఉండటం.. జాతీయ రహదారి కావడంతో వ్యాపారులు గంజాయిని సులభంగా ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకొని గుట్టు చప్పుడు కాకుండా విక్రయిస్తున్నారు. పరిశ్రమల వద్ద ఉండే చిన్న చిన్న టీ స్టాళ్లు, హోటళ్లు, కిరాణా దుకాణాల్లో గుట్టుగా అమ్మేస్తున్నారు.

పాపం పసివాళ్లు

విద్యార్థులకు చాక్లెట్లు అంటే ఎంతో ఇష్టమో తెలియంది కాదు. దీన్ని ఆసరాగా చేసుకొని అక్రమార్కులు గంజాయిని చాకెట్ల రూపంలో విక్రయిస్తున్నారు. ఇవి తిన్న విద్యార్థులు మత్తుబారిన పడుతూ వింతగా ప్రవర్తిస్తున్నారు. పాఠశాల పక్కన పాన్‌డబ్బాలో గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్న ఘటన రెండు రోజుల క్రితం కొత్తూరులో వెలుగు చూసింది. ఇప్పటి వరకు యువకులు, వలస కార్మికులకు చాక్లెట్లు విక్రయించే ముఠా ఇప్పుడు విద్యార్థులను లక్ష్యం చేసుకోవడం ఆందోళనకు గురి చేస్తోంది.

మచ్చుకు కొన్ని..

- ఏడాది క్రితం షాద్‌నగర్ ఎల్లంపల్లికి చెందిన కుర్వ రమేష్, వరంగల్‌కు చెందిన వీరన్న, భద్రాచలానికి చెందిన సోమరాజు ముఠాగా ఏర్పడ్డారు. కారు ఇంజన్ కింద భాగంలో ఇనుప ప్లేట్లు అమర్చి రూ.7లక్షల విలువ చేసే 110 కిలోల గంజాయిని షాద్‌నగర్‌కు తీసుకొస్తుండగా శంషాబాద్ ఎస్ఓటీ, షాద్‌నగర్ పోలీసులు రాయికల్ టోల్ ప్లాజా వద్ద పట్టుకున్నారు.
- గత ఏడాది డిసెంబర్‌లో షాద్‌నగర్‌లోని నాగులపల్లి రోడ్డులో ఉన్న కిరాణం దుకాణంలో గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్న సుశీల్, శశికాంత్‌ను, నందిగామ అయ్యప్ప స్వామి దేవాలయం సమీపంలో కిరాణం దుకాణంలో గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్న సత్యదేవ్, జలంధర్, అజయ్‌కుమార్‌ను ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 480 గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నారు.
- గత జూన్ 17న కొత్తూరులోని కేడియా పరిశ్రమ సెక్యూరిటీ గదిని గంజాయి నిల్వ కోసం అనికుమార్ రావత్ అడ్డాగా ఏర్పాటు చేసుకొన్నాడు. ఒడిశా నుంచి గంజాయిని దిగుమతి చేసుకొని పరిశ్రమలో పని చేసే కార్మికులతో పాటు వారి స్నేహితులకు గంజాయిని విక్రయిస్తున్న విషయం తెలుసుకున్న ఎక్సైజ్ పోలీసులు అనిల్ కుమార్‌రావత్‌ను చాకచక్యంగా పట్టుకున్నారు.
- షాద్‌నగర్ బైపాస్‌లో రసోయ్ హోటల్ సమీపంలో, బూర్గుల గేటు వద్ద గంజాయిని తీసుకొస్తున్న వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. ఎలికట్ట గ్రామ శివారులోని ఐరన్ పరిశ్రమ వద్ద ఉన్న హోటల్‌లో కార్మికులకు గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు.
- నూతన సంవత్సర వేడుకల సందర్భంగా భువనగిరికి చెందిన ప్రియాంకరెడ్డి, విజయనగరానికి చెందిన శ్రీతేజ వాహనంలో గోవా నుంచి హైదరాబాద్ రవాణా చేస్తున్న రూ.లక్ష విలువైన డ్రగ్స్‌ను అక్రమ రవాణా చేస్తుండగా షాద్‌నగర్ పోలీసులు పట్టుకున్నారు.

మరింత నిఘా పెంచాలి

ఇక్కడి పరిశ్రమల్లో చాలా మంది వివిధ రాష్ట్రాలకు చెందిన వారు ఉండటం, ఎక్కువ సేపు పరిశ్రమల్లో సమయం కేటాయిస్తుంటడంతో వారికి గంజాయి విక్రయిస్తే విషయం బయటికి పొక్కకుండా ఉంటుందని.. చిన్నారులకు అమ్మితే ఎవరికీ అనుమానం రాదని అక్రమార్కులు చాక్లెట్ల రూపంలో అమ్ముతున్నారు. ఇలాంటి వాటిని కట్టడి చేసేందుకు పోలీసులు, ఎక్సైజ్ శాఖ అధికారులు నిఘా పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రత్యేక బృందాలతో నిఘా



గంజాయి విక్రయాలు, డ్రగ్స్ సరఫరాపై ప్రత్యేకంగా దృష్టి సారించాం. ముఖ్యంగా పరిశ్రమలు, పాఠశాలల పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలతో నిఘా ఏర్పాటు చేశాం. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదు.

– అంజన్‌కుమార్, ఎక్సైజ్ సీఐ, షాద్‌నగర్

రౌడీ షీటర్ దారుణ హత్య

- మాట్లాడుకుందామని పిలిచి కత్తులతో దాడి
- మర్మాంగాలు కోసిన ప్రత్యర్థులు
- 23 కేసుల్లో నిందితుడిగా ఉన్న హతుడు



ముబీన్(ఫైల్)

పహాడీషరీఫ్: రౌడీ షీటర్ దారుణ హత్యకు గురైన సంఘటన బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపేట అబుబాకర్ కాలనీకి చెందిన మహ్మద్ ముబారక్ సిగర్ అలియాస్ ముబీన్(33) బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీషీటర్‌గా నమోదై ఉన్నాడు. యుక్త వయసు నుంచే నేరబాట పట్టిన ఇతనిపై ఇప్పటి వరకు 23 కేసులు నమోదయ్యాయి. ఇందుల్లో మూడు హత్య(పహాడీషరీఫ్ (2010లో), రాజేంద్రనగర్, బండ్లగూడ ఠాణాల పరిధి), మూడు హత్యాయత్నం, ఏడు చోరీ, మూడు ఆయుధ దుర్వినియోగం, రెండు కిడ్నాప్, ఐదు గొడవలకు సంబంధించిన కేసులున్నాయి. ఎవరిని పడితే వారిని బెదిరించడం.. నగదు, బైక్‌లు, సెల్‌ఫోన్లు లాక్కోవడం వంటివి చేస్తుంటాడు. ఎర్రకుంటలో గత నెల 8న పదిహేడేళ్ల బాలుడిని కిడ్నాప్ చేయడంతో బాలాపూర్ పోలీసులు అతన్ని రిమాండ్‌కు తరలించారు. కొద్ది రోజులకే జైలు నుంచి వచ్చిన ముబారక్ ఫలక్‌నుమా పీఎస్ పరిధిలో అనుమానాస్పదంగా సంచరిస్తుండడంతో అక్కడి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. ఆరు రోజుల అనంతరం జైలు నుంచి విడుదలయ్యాడు. పోలీస్ స్టేషన్‌కే తలనొప్పిగా మారిన ఇతడు చట్టాల్లోని లొసుగులతో తరచూ బెయిల్‌పై విడుదలై నేర ప్రవృత్తిని కొనసాగిస్తూ వస్తున్నాడు. ఇదిలా ఉండగా రాజేంద్రనగర్, లంగర్ హౌస్ ప్రాంతాలకు చెందిన ఇద్దరు రౌడీ షీటర్లతో ఇతనికి పాత గొడవలున్నాయి. రౌడీషీటర్లతో పాటు వారి అనుచరులకు సంబంధించి గతంలో బైక్‌లు, సెల్‌ఫోన్లు, కొంత నగదు కూడా తీసుకున్నాడు. ఈ నేపథ్యంలో ఇరువురి మధ్య పరిచయస్తులు మాట్లాడుకుందామంటూ ముబారక్‌ను బుధవారం అర్ధరాత్రి వాదే ముస్తఫాలోని మదీనా మజీద్ ప్రాంతానికి పిలిపించారు. అక్కడికి చేరుకున్నాక మాట్లాడుకునే క్రమంలో మాటామాటా పెరిగింది. దీంతో ఆగ్రహానికి గురైన ప్రత్యర్థి వర్గం ముబారక్‌పై కత్తులు, కర్రలతో విచక్షణా రహితంగా దాడికి పాల్పడింది. అంతటితో ఆగకుండా అతని మర్మంగాలను కూడా కోసేశారు. దీంతో ముబారక్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న వెంటనే మహేశ్వరం డీసీపీ డి.సునితారెడ్డి, అదనపు డీసీపీ సత్యనారాయణ, ఏసీపీ శ్రీనివాస్ యాదవ్, బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ బి.వెంకట్‌రెడ్డి, అదనపు ఇన్‌స్పెక్టర్ మధు ఘటనా స్థలానికి చేరుకొని హత్య జరిగిన తీరును పరిశీలించారు. ఘటనా స్థలంలో కర్రలు, పగిలిన మద్యం బాటిళ్లు పడి ఉన్నాయి. వెంటనే డాగ్ స్క్వాడ్‌ను రప్పించి నిందితుల కోసం గాలించారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించారు. హత్య చేసిన వారిలో ఆదిల్, అమీర్, హుస్సేన్‌లతో పాటు మరికొందరు ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వివాహేతర సంబంధాలు ఏవైనా ఉన్నాయా..? అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. దీనికి తోడు హతుడికి హోమోసెక్స్‌వల్స్‌తోనూ సంబంధాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా ముబీన్‌కు గతంలో వివాహం జరగగా ఇతడి ప్రవర్తనకు విసిగిపోయిన భార్య వదిలివెళ్లిపోయింది.

శుభాకాంక్షల వెల్లువ

ఘనంగా జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి జన్మదిన వేడుకలు



అనితారెడ్డికి ఫొటో ఫ్రేమ్ అందజేస్తున్న రాఘవేందర్

మహేశ్వరం: మహేశ్వరం మండల ప్రజల ఆశీస్సుల తోనే తాను జెడ్పీటీసీ సభ్యురాలిగా గెలుపొంది, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ అయ్యానని తీగల అనితా రెడ్డి అన్నారు. ఘట్టుపల్లి శివారులోని కోరుపోలు చంద్రారెడ్డి (కేసీఆర్) గార్డెన్‌లో గురువారం ఆమె జన్మదిన వేడుకలు నిర్వహించారు. చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, మహేశ్వరం, రాజేంద్రనగర్, చేవెళ్ల ఎమ్మెల్యేలు సబితారెడ్డి, ప్రకాశ్‌గౌడ్, కాలె యాదయ్య, ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డితో పాటు పలువురు జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, బీఆర్‌ఎస్ నాయకులు ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి మర్యాద రాఘవేందర్‌రెడ్డి, మన్సాన్‌పల్లి బీఆర్‌ఎస్ నాయకులు అనితారెడ్డి భారీ ఫొటో ఫ్రేమ్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా అనితారెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్, కేటీఆర్, సబితమ్మ సహకారంతోనే తాను ఈస్థాయికి ఎదిగానన్నారు. మహేశ్వరం తనకు పుట్టినిల్లని, ఈ ప్రాంత అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషిచేస్తానని తెలిపారు.

గంజాయి ముఠా గుట్టురట్టు



పోలీసుల అదుపులో నిందితులు, స్వాధీనం చేసుకున్న గంజాయి

- ఆర్టీసీ, ప్రైవేటు బస్సుల తనిఖీ
- ఎనిమిది మంది అరెస్టు
- రూ.7లక్షల విలువ చేసే 24 కిలోల గంజాయి స్వాధీనం

అబ్దుల్లాపూర్‌మెట్: ఇతర రాష్ట్రాల నుంచి హైదరాబాద్‌కు వచ్చే బస్సుల్లో అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ఎనిమిది మంది ముఠా సభ్యులను ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద రూ.7లక్షల విలువ చేసే గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన గురువారం అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. హయత్‌నగర్ ఎక్సైజ్ సీఐ లక్ష్మణ్‌గౌడ్ తెలిపిన ప్రకారం.. ఎక్సైజ్ ఉన్నతాధికారుల ఆదేశం మేరకు ఆ శాఖ అధికారులు తెల్లవారుజామున అబ్దుల్లాపూర్‌మెట్‌లోని ఫిల్మ్‌సిటీ గేట్ ఎదుట ఆర్టీసీ, ప్రైవేటు బస్సుల తనిఖీలు చేపట్టారు. జిల్లా డిప్యూటీ కమిషనర్ డేవిడ్ రవికాంత్ ఆధ్వర్యంలో సరూర్‌నగర్ ఎక్సైజ్ సూపరిండెంట్ రవీందర్‌రావు, హనుమంతరావు నేతృత్వంలో ఆంధ్రా, ఒడిశా, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాలను తనిఖీ చేశారు. ఈ సమయంలో ఎనిమిది మంది ప్రయాణికుల నుంచి 24 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పట్టుబడ్డ గంజాయి విలువ రూ.7 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. ఏపీలోని విశాఖ జిల్లా, పలాస, రాజమండ్రి, నర్సీపట్నం, అరకు, ఒడిశాలోని మల్కన్ గిరి నుంచి ఢిల్లీ, మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ ప్రాంతాలకు గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్నట్లు పట్టుబడిన యువకులు తమ విచారణలో వెల్లడించారన్నారు. గంజాయిని సరఫరా చేస్తే ఒక్కొక్కరికి రూ.10 వేలు కమీషన్ ఇస్తామని చెప్పడంతోనే ఇలా చేస్తున్నామని పట్టుబడిన యువకులు తెలిపారన్నారు. ఈ దాడుల్లో సరూర్‌నగర్ డీటీఎఫ్ సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐలు వెంకన్న, జి.హనుమంతు, జి.సరళ, ఎండీ పాష, హనుమంతు సరూర్ నగర్ డివిజన్ పరిధిలోని సిబ్బంది పాల్గొన్నారు.

డ్రగ్స్ విక్రేతలను శిక్షిస్తాం

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

కొత్తూరు: మాదకద్రవ్యాల విక్రయాలను పూర్తిగా నిర్మూలించేందుకు పోలీసులకు పూర్తిస్వేచ్ఛ కల్పిస్తున్నట్లు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో గంజాయి చాక్లెట్లు తిన్న విద్యార్థులు అనారోగ్యానికి గురైనట్లు వార్తలు రావడంతో ఆయన గురువారం పాఠశాలను సందర్శించారు. శంషాబాద్ ఏసీపీ రాంచందర్‌రావు, డీఈఓ సుశీందర్‌రావు, డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటేశ్వరరావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జయలక్ష్మి, హెచ్‌ఎం అంగోర్‌నాయక్‌ను అడిగి ఘటన వివరాలను తెలుసుకున్నారు. విద్యార్థులతో ఉపాధ్యాయులు స్నేహపూర్వక బంధాలను కొనసాగించాలన్నారు. చదువుతో పాటు మానసిక రుగ్మతలు, ఆరోగ్య అలవాట్లపై తరచుగా అవగాహన కల్పించాలని సూచించారు. నియోజకవర్గంలో గంజాయి, నిషేధిత మత్తు పదార్థాల విక్రయాలపై నిఘా పెట్టాలన్నారు. వీటిని విక్రయించినా, కొనుగోలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. కొత్తూరులో విద్యార్థులకు గంజా యి చాక్లెట్లు విక్రయించిన ముగ్గురు నిందితులను ఇప్పటికే అరెస్ట్ చేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ కేసుకు సంబంధం ఉన్న మిగిలిన దుండగులను పోలీసులు మూడు రోజుల్లో పట్టుకుంటారని ఎమ్మెల్యే మీడియాకు చెప్పారు.

కొనుగోలు చేసినా నేరస్తులే..

డ్రగ్స్‌కు అలవాటు పడితే అనారోగ్యాల బారిన పడి విలువైన జీవితాలను నాశనం చేసుకుంటారని వైద్య, విద్యాశాఖ అధికారులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. వీటిని కొనుగోలు చేసినా, సేవించిన వారు సైతం చట్టం పరిధిలో నేరస్తులుగా పరిగణింపబడతారని వివరించారు. విద్యార్థులు డ్రగ్స్ బారిన పడితే అనారోగ్యంతో పాటు చదువుపై సైత ం ఏకగ్రత కోల్పోతారని చెప్పారు. ఎక్కడైన మత్తు పదార్థాల విక్రయాలు జరుగుతున్నట్లు తెలిస్తే పోలీ సులకు, తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుదర్శన్‌గౌడ్, దేవేందర్‌ముదిరాజ్, హరినాథ్‌రెడ్డి, ఏబీవీపీ, బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి..

అన్నదమ్ములకు తీవ్ర గాయాలు



ప్రమాదస్థలిలో క్షతగాత్రులు ప్రభాకర్, ఈశ్వర్

యాచారం: రోడ్డు ప్రమాదంలో అన్నదమ్ములు తీవ్రంగా గాయడపడ్డారు. యాచారం పోలీసులు తెలిపిన ప్రకారం .. మండల పరిధిలోని నందివనపర్తి గ్రామానికి చెందిన మల్లెపల్లి ప్రభాకర్, ఈశ్వర్ గురువారం ఉదయం బైక్‌పై మాల్‌మార్కెట్‌కు వచ్చారు. పనులు ముగించుకుని తిరుగుప్రయాణం అయ్యారు. ఈ క్రమంలో సాగర్‌రోడ్డుపై చింతపట్ల గేట్ వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోగా బైక్ అదుపు తప్పి కిందపడిపోయారు. తీవ్ర గాయాలైన క్షతగాత్రులున 108 అంబులెన్స్‌లో నగరంలోని ప్రైవట్ ఆస్పత్రికి తరలించారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

ఆరు సెల్‌ఫోన్‌లు, నగదు స్వాధీనం

మీర్‌పేట: పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మీర్‌పేట పీఎస్ ఎస్‌ఐ బద్యానాయక్ ప్రకారం.. నందిహిల్స్ రోడ్ నెం-3లో నగేష్‌యాదవ్, రామచందర్, వెంకటేశ్వర్లు, శ్రీకాంత్ సాగర్, కృష్ణయ్యలు బుధవారం అర్ధరాత్రి ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు పోలీసులు దాడి చేసి పేకాడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ.15,080 నగదు, ఆరు సెల్‌ఫోన్‌లను స్వా. దీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

విద్యార్థులు, ఉపాధ్యాయుడికి సన్మానం



విద్యార్థులు, ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న హెచ్‌ఎం రేణుక

మొయినాబాద్‌రూరల్: జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్‌లో అమ్డాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌కు మొదటి స్థానం రావడం ఆనందంగా ఉందని హెచ్‌ఎం రేణుక అన్నారు. ఈ మేరకు గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను సన్మానించి అభినందించారు. ఉపాధ్యాయుడు నగేశ్‌బాబు నేటికీ ఒక్క సెలవు తీసుకోకపోవడంతో ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రేణుక మాట్లాడుతూ.. పాఠశాలలో పని చేస్తున్న ఎస్‌ఏ ఫిజికల్ ఉపాధ్యాయుడు నగేశ్‌బాబు విద్యార్థులకు పాఠాలు బోధించడంలో ఎంతో ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. వారి శ్రమ వల్లే జిల్లా స్థాయిలో మొదటిస్థానం దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యనారాయణరెడ్డి, స్వరూప, మంజుల, సంజీవ్‌కుమార్, సంగీత, అరుణ, సత్యనారాయణ, అబ్దుల్ ఖాదర్, గ్రామ ప్రజా ప్రతినిధులు, గోపికృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్కు విస్తరణకు కృషి

ఎమ్మెల్యే సబితారెడ్డి



చిన్నారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

పహాడీషరీఫ్: జల్‌పల్లి అర్బన్ ఫారెస్ట్ పార్కును విస్తరించేందుకు కృషి చేస్తానని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. గురవారం సాయంత్రం ఆమె పార్కును సందర్శించి పలువురితో ముచ్చటించారు. వాకింట్ ట్రాక్, క్రీడా పరికరాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని పార్కుకు వచ్చిన వారు ఎమ్మెల్యేకు వివరించి ధన్యవాదాలు తెలిపారు. పార్కులో చిన్నారులను ఆప్యాయంగా పలకరించి.. సౌకర్యాలపై పెద్దలను ఆరా తీశారు. ఎమ్మెల్యే వెంట జల్‌పల్లి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్లా సాది, కౌన్సిలర్ శంషుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తున్న ఇద్దరిపై కేసు

తొమ్మిది సిలిండర్ల స్వాధీనం

నందిగామ: అక్రమంగా గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తున్న దుకాణాలపై గురువారం పోలీసులు దాడి చేసి తొమ్మిది సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ గోపాల కృష్ణ తెలిపిన ప్రకారం మండల కేంద్రం శివారులోని పృథ్వి కాలనీలో అన్నారం సిద్దులు, మహ్మద్ జమునుద్దీన్ కిరాణ షాపులు నడుపుతున్నారు. వీరు సబ్సిడీపై పెద్ద సిలిండర్లను కొనుగోలు చేసి వాటిని చిన్న సిలిండర్లలో అక్రమంగా రీఫిల్లింగ్ చేస్తున్నారు. శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి, స్థానిక సీఐ ప్రసాద్ ఆదేశానుసారం ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఈ రెండు కిరాణాల్లో తొమ్మిది సిలిండర్లను స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గోపాలకృష్ణ చెప్పారు.

మోడల్‌స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

శంషాబాద్ రూరల్: మండలంలోని పాల్మాకులలో ఉన్న మోడల్ స్కూలులో 6 నుంచి 10వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ విష్ణుప్రియ తెలిపారు. ఈ నెల 12 నుంచి విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖా స్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్‌లో ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఆరవ తరగతిలో 100 సీట్లు, మిగతా తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

రైతులకు దీర్ఘకాలిక రుణాల పంపిణీ

శంషాబాద్ రూరల్: మండలంలోని మల్కారం సొసైటీ ఆధ్వర్యంలో రైతులకు రుణాలను అందజేశారు. నాబార్డు నుంచి రూ.కోటి 43 లక్షల దీర్ఘకాలిక రుణాలను గురువారం చైర్మన్ బి. సతీష్ ప ంపిణీ చేశారు. రైతులు తీసుకున్న పంట రుణా లు, దీర్ఘకాలిక రుణాలను వాయిదా ప్రకారం చెల్లి ంచి సంఘం అభివృద్ధికి తోడ్పాడలని అన్నారు.

మహిళ అదృశ్యం



అదృశ్యమైన మమత (ఫైల్)

శంషాబాద్ రూరల్: మహిళ అదృశ్యమైన ఘటన బహదూర్‌గూడలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బహదూర్‌గూడ శివారులోని కేఎల్‌ఆర్ అక్బర్ ఫాంలో కె. లక్ష్మీనారాయణ, మమత దంపతులు నివాసముంటున్నారు. ఈ నెల 10న లక్ష్మీనారాయణ పని నిమిత్తం తుక్కుగూడ వెళ్లి సాయంత్రం వచ్చాడు. తిరిగి వచ్చేటప్పటికి అతని భార్య మమత ఇంట్లో కనిపించలేదు. అన్ని చోట్ల వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం

శంషాబాద్ రూరల్: మండలంలోని పెద్దషాపూర్‌తండాకు చెందిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తండా వాసి సభావత్ భాస్కర్ కు మతిస్థిమితం లేదు. ఇతను 2023 నవంబరు 27న ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అతని కోసం వెతికినా ఆచూకీ తెలియలేదు. దీంతో గురువారం కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

స్కేటింగ్‌లో రజతం సాధించిన తరుణి



శంషాబాద్: స్కేటింగ్‌లో శంషాబాద్ కు చెందిన విద్యార్థిని అత్యుత్తమ ప్రతిభను కనబరుర్చారు. ఇటీవల దేశ రాజధాని ఢిల్లీలో పదిరోజుల పాటు జరిగిన స్కేటింగ్ పోటీల్లో పట్టణంలోని ఇంద్రానగర్‌కు చెందిన గడ్డమీది ప్రవీణ్‌కుమార్ కుమార్తె తరుణి, రజత పతకాన్ని సాధించింది. ప్రముఖ స్కేటింగ్ క్రీడాకారుడు సయ్యద్ హుస్సేన్ బాలికకు శిక్షణ ఇచ్చాడు. ఈ సందర్భంగా వారి తల్లిదండ్రులతో పాటు స్థానికులు, బ్రూక్ ఫీల్డ్ పాఠశాల యజమాన్యం విద్యార్థిని అభినందించారు.

చేవెళ్ల గడ్డపై బీజేపీ జెండా ఎగురవేస్తాం



మాట్లాడుతున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

అనంతగిరి: వచ్చే లోక్ సభ ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై బీజేపీ జెండా ఎగుర వేస్తామని మాజీ ఎంపీ, పార్టీ రాష్ట్ర నాయకుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన వికారాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డితో కలిసి మాట్లాడారు. ప్రపంచంలో పదో స్థానంలో ఉన్న భారతదేశం మోదీ పాలనతో ఐదో స్థానానికి ఎదిగిందన్నారు. రానున్న రోజుల్లో తృతీయ స్థానానికి తీసుకువచ్చేందుకు పార్టీ పనిచేస్తోందన్నారు. దేశంలోని 7లక్షల గ్రామాలకు కేంద్రప్రభుత్వ పథకాలను పరిచయం చేసేందుకే వికసిత్ భారత్ కార్యక్రమం చేపట్టామన్నారు. మోదీ పాలనకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. చేవెళ్ల బీజేపీ టికెట్ తనకే వస్తుందని ప్రజలు ఎక్కడికి వెళ్లినా బీజేపీ గెలుపునకు శ్రమిస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్వం కేంద్రంతో సఖ్యతగా లేదని.. ఈ ప్రభుత్వమైనా అభివృద్ధి విషయంలో కేంద్రంతో సత్సంబంధాలు కొనసాగించి అభివృద్ధి పనులు చేయించుకోవాలని సూచించారు. రాష్ట్రంలో పదికి పైగా స్థానాల్లో కాషాయ జెండా ఎగరడం ఖాయమన్నారు. నేను కాంగ్రెస్ పార్టీలోకి వెళ్తున్నాననే మాటలు అవాస్తవమని కొట్టి పారేశారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్యే ఎన్నికల్లో బీజేపీ ఓటు బ్యాంకు మూడింతలు పెరిగిందన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలంగా ఉందని, శక్తి కేంద్రాలు, బూత్‌లు బలంగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాండుగౌడ్, అసెంబ్లీ ఇన్‌చార్జి శ్రీధర్‌రెడ్డి, సీనియర్ నాయకులు నరోత్తంరెడ్డి, పరమేశ్వర్, మాధవి, రఘు పాల్గొన్నారు.

'లెవీ' త్వరితగతిన పూర్తిచేయాలి

- లేదంటే సీఎమ్మార్ అనుమతులు రద్దు చేస్తాం
- పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రఘునందన్ హెచ్చరిక



యాచారంలో రాఘవేంద్ర రైస్‌మిల్‌ని తనిఖీ చేస్తున్న డీటీ రఘునందన్

ఇబ్రహీంపట్నం: లెవీ బియ్యాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని లేదంటే సీఎమ్మార్ అనుమతులను రద్దు చేస్తామని రైసు మిల్లర్లకు పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ హెచ్చరించారు. గురువారం ఆయన యాచారంలోని రాఘవేంద్ర రైస్‌మిల్, ఇబ్రహీంపట్నంలోని పౌర సరఫరాల సంస్థ గిడ్డంగిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిల్లర్లు కొన్ని కారణాలను సాకుగా చూపి లెవీని పూర్తి చేయడంలో జాప్యం చేస్తున్నారన్నారు. క్షేత్ర స్థాయిలో నిజాలు నిగ్గు తేల్చేందుకు మిల్లులను తనిఖీ చేస్తున్నామన్నారు. నిర్ణీత గడువు లోపు లెవీ బియ్యాన్ని భారత ఆహార సంస్థకు అప్పగించాల్సిన మిల్లర్లు కాలయాపన చేయడం సరికాదన్నారు. ఇటీవల జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో లెవీని గడువు లోపు పూర్తి చేయాని మిల్లులను బ్లాక్ లిస్టులో పెట్టాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. అనంతరం ఇబ్రహీంపట్నంలోని పౌరసరఫరా సంస్థ గిడ్డంగిని తనిఖీ చేసి చౌక దుకాణాలకు నిర్ణీత గడువులోగా రేషన్ బియ్యం రవాణా చేయాలని రఘునందన్ సూచించారు. ప్రజా పంపిణీ వ్యవస్థ పారదర్శకతకు ప్రాధాన్యం ఇచ్చేలా సాంకేతికతతో కూడిన జీపీఎస్ వాహనాలను వాడుతున్నామన్నారు. రేషన్ దుకాణాలకు సకాలంలో బియ్యం పంపిణీ చేస్తేనే ప్రజా పంపిణి వ్యవస్థ ప్రతిష్ట పెరుగుతుందన్నారు. ఈ తనిఖీల్లో డీటీ పఠాన్, హైదర్ అలీఅఖాన్ ఉన్నారు.